# అమ్మాయి పెళ్ళి

భమిడిపాటి భాస్కర రామాచార్యు

కృష్ణ రూమ్‌కి చేరుకునేసరికి రాత్రి ఏడు గంటలయింది. ఆ సంవత్సరమే కృష్ణకు ఆ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరే వేళకే మొదటి టెరమ్ సగంపైచిలుకు గడిచిపోయింది. అప్పటికి ఆఖరు టెరమ్ పూర్తవవస్తోంది.

పందెపు గుర్రం వేగంతో పాఠాలు చెప్పకుంటూపోయినా అప్పటికింకా తను పూర్తిచేయవలసిన కోర్సు ఇంకా మిగిలే వుంది. ఏదోరకంగా సిలబసు పూర్తయిందనిపించి స్టూడెంట్సుచేత బల్లలు గుద్దించే టెక్నిక్ కృష్ణకు ఇంకా తెలియదు. ఏదీ! ఇంకా సర్వీసులో చేరి ఒక్క విద్యా సంవత్సరమన్నా గడవలేదుకదా! తాను చెప్పింది విద్యార్థులకు పూర్తిగా అర్థం కావాలనే చాదస్తం చాలావుంది కృష్ణలో.

అందుకే ఎక్స్‌ట్రా క్లాసులుపెట్టి పాఠాలు చెప్పకుంటూ పోతున్నాడు కృష్ణ. రూమ్‌కు చేరడంలో ఆలస్యానికి అదే కారణం.

రూమ్ తాళం తీసి తలుపు తెరిచాడు. తలుపు తెరిచేటప్పటికి తలుపు సందునుండి కవరు వంటిది ఒకటి జారి కిందపడింది.

తనకు వచ్చిన ఉత్తరాలను పోస్ట్‌మన్ అలా తలుపుసందులో దూర్చివెళ్ళడం మామూలే!

చేతిలో కవరుతో గదిలో అడుగుపెట్టి స్విచ్చి నొక్కాడు కృష్ణ. లైటు వెలుగులో కవరువైపు చూచాడు.

అది తల్లి వ్రాసిన ఉత్తరం.

కవరు తెరిచాడు కృష్ణ.

"శ్రీరస్తు, చిరంజీవి కృష్ణను మీ అమ్మ నిత్యమూ దీవించి వ్రాయునది. ఇక్కడ అందరం కులాసా. అన్నయ్యగారి శ్రీదేవి, మన శ్రీలక్ష్మి కూడా కులాసా.

శ్రీలక్ష్మి పెళ్లి విషయంలో నువ్వుగాని, మీ అన్నయ్యగాని ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. మీ అన్నయ్యకు ఎన్నిసార్లో చెప్పాను. చెల్లాయి శ్రీలక్ష్మికి తగిన సంబంధం చూడరా, తరువాత యింకా నీ కూతురు శ్రీదేవి కూడా ఉందిరా అని. 'అలాగేలేవే!' అంటాడు తప్ప ఏ ప్రయత్నమూ చెయ్యడు.

నాయనా కృష్ణా! మీ నాన్నగారే వుంటే చెల్లాయి పెళ్లికి ఇన్నాళ్ళు ఆలస్యం చేసేవారా? ఇప్పటికే దీనియీడువాళ్ళు పెళ్ళిళ్ళయి పండంటి బిడ్డల్ని కూడా ఎత్తుకున్నారు. ఆడపిల్లకు పెళ్ళి చెయ్యకుండా ఇన్నాళ్ళు అట్టేపెట్టడం మన ఇంటావంటా ఎప్పుడూ లేదు.

అమ్మ ఏదో చాదస్తంగా రాస్తోందని కొట్టిపారెయ్యకుసుమా! నువ్వయినా పూనుకుని ఈ ఏడాదిలో శ్రీలక్ష్మి పెళ్లి అయిందనిపించాలి. ఇరుగుపొరుగులు 'ఏం పిన్నిగారూ! ఈ ఏడాదయినా బూరె ముక్క పెట్టించరా?' అని కొందరూ, 'ఏం వదినా! అమ్మాయిని విడిచిపెట్టి ఉండలేని మమకారంతో ఏకంగా అమ్మాయి పెళ్ళే వాయిదా వేస్తున్నావా?' అని కొందరూ వేళాకోళంకూడా చేస్తున్నార్రా కృష్ణా!

అందుచేత నువ్వు ఏలాగో ఓలా వీలు చేసుకుని ఇంటికి రావాలి. ఏవో రెండు మూడు సంబంధాలు నా చెవినపడ్డాయి. ప్రయత్నం అంటూ చేస్తే ఏదో ఒకటి కుదరకపోదు.

ఈ తల్లి ఆవేదనను అర్థంచేసుకో!

ఆలస్యంచెయ్యకుసుమా!

ఇట్లు మీ అమ్మ,
రామలక్ష్మమ్మ

అని వుంది ఉత్తరంలో.

కూతురి పెళ్ళికోసం పరితపించే తల్లి హృదయాన్ని అర్థంచేసుకున్నాడు కృష్ణ. కళ్ళు కూడా కాస్త చెమర్చకపోలేదు. తల్లి చెప్పిన మాట నిజమే! తమ అన్నదమ్ము లిద్దరూ పూనుకొని చెల్లెలి పెళ్ళి జరిపించాలి. మరి అన్నయ్య ఎందుకు పట్టించుకోవడంలేదో!

అతడి బాధలు అతడికీ ఉంటాయని మనసు సరిపెట్టుకుందుకు ప్రయత్నించాడు కృష్ణ.

కాని నిలుచున్నపాళాన తాను బయలు దేరడానికి వీలులేని పరిస్థితి. తానా కొత్తగా సర్వీసులో చేరాడు. చెప్పవలసిన పాఠ్యాంశాలో ఇంకా పూర్తికాలేదు. ఇలాటి సమయంలో ప్రిన్స్‌పాల్‌గారు సెలవు ఇస్తారో యివ్వరో? అయినా మరోసారి అన్నయ్యకు ఉత్తరం వ్రాసి చూద్దాం అనుకున్నాడు.

వారం గడిచింది. పదిరోజులు గడిచాయి. అన్న నుండి మాత్రం ఏ ఉత్తరమూ రాలేదు.

పదిహేనురోజులు గడిచాయి. సాయంత్రం గది తాళం తీసేసరికి కవరొకటి జారి కిందపడింది.

కృష్ణకు ఏనుగెక్కినంత సంబరమైంది. 'చివరకు అన్నయ్య ఉత్తరం వ్రాశాడన్నమాట' అని నవ్వుకుంటూ స్విచ్చి నొక్కాడు.

లైటు కాంతిలో కవరు చూడగానే కృష్ణ నవనాడులూ క్రుంగిపోయాయి. అది అన్నగారు వ్రాసిన ఉత్తరం కాదు. ఆ ఉత్తరమూ తల్లి వ్రాసినదే!

ఉత్తరం తెరిచాడు కృష్ణ. తాను ఉత్తరం రాసిన పక్షం రోజులు గడిచిపోయినా, కనీసం జవాబుకూడా రాయలేదని నిష్ఠూరంగా రాసింది తల్లి.

'అంటే? అన్నయ్య కనీసం తాను రాసిన ఉత్తరం సంగతి కూడా అమ్మకు చెప్పలేదన్నమాట' మనసులో బాధపడ్డాడు కృష్ణ.

కృష్ణ తిరిగి ఉత్తరంలోకి దృష్టి మళ్లించాడు.

వచ్చేమాసంలో మూఢమి వస్తుందనీ, ఆ తరువాత నెల శూన్యమాసం కనుక వెంటనే చెల్లెలి పెళ్ళి వ్యవహారం చూడాలని వ్రాసింది రామలక్ష్మమ్మ. రాయడం మాత్రం కాస్త ఘాటుగానే రాసిందావిడ.

ఇక తాను ఏదో చేస్తేకాని లాభం లేదనుకున్నాడు కృష్ణ. కేలండరువైపు చూచాడు. ఆ రోజు గురువారం. వచ్చే శనివారం రెండవ శనివారం. కాలేజీకి సెలవు. మరునాడు ఎలాగూ ఆదివారం. సోమ, మంగళవారాలు రెండు రోజులూ ఏవో ప్రభుత్వ సెలవుదినాలు. ఇదీ మన మంచికే అనుకున్నాడు కృష్ణ. శనివారంనాడు ఆరు

నూరయినా నూరు ఆరయినా బయలుదేరి తీరాలనుకున్నాడు.

ముందుగా అనుకున్నవిధంగా శనివారం తెల్లవారుఝామున బయలుదేరాడు కృష్ణ. ఆ పగలంతా రైలులోనూ, బస్సులోనూ ప్రయాణంచేసి సాయంత్రం ఆరుగంటల వేళకు సొంతవూరు చేరుకున్నాడు.

కొడుకును చూచి తల్లి మొహం చాటంతయింది.

"లేరా కృష్ణా! స్నానం చెయ్యి. ఈలోగా నేను భోజనం వడ్డిస్తాను" అంది రామలక్ష్మమ్మ.

"ఏమయ్యా మరిదీ! కులాసాయేనా?" అంటూ ఎదురు వచ్చింది వదినగారు.

"చిన్నన్నయ్యా!" అంటూ శ్రీలక్ష్మి, "బాబాయ్!" అంటూ శ్రీదేవి ఎదురు వచ్చి పలకరించారు.

అందరికీ సమాధానాలు చెబుతూ, "మా అన్నయ్య ఏడమ్మా వదినా?" అని అడిగాడు.

"ఊరెళ్ళారయ్యా ఆఫీసుపనిమీద. మరో వారానికిగాని రారు" చెప్పింది వదినగారు.

"అమ్మా! ఏవో సంబంధాలు నీ చెవినిపడ్డాయన్నావు. వాటి వివరాలు చెప్పమ్మా!" అడిగాడు కృష్ణ.

"ఒరేయ్ కృష్ణా! ఎప్పుడో పొద్దు పొడవకుండా రైలెక్కావు. ఇల్లు చేరేసరికి పొద్దుగూకింది. ముందు స్నానంచేసి భోజనం కానియ్యి. కిక్కిరిసిన ప్రయాణంలో ఒళ్ళంతా ముద్దయివచ్చావు. రాత్రి హాయిగా విశ్రాంతి తీసుకో. తెల్లవారాక అన్నీ చెబుతాను" మాతృవాత్సల్యం తొణికిసలాడింది రామలక్ష్మమ్మ కంఠంలో.

తెల్లవారింది. స్నానంచేసి కూర్చున్నాడు కృష్ణ.

చెల్లెలు శ్రీలక్ష్మి పొగలుకక్కుతున్న కాఫీగ్లాసందించింది.

కృష్ణ కాఫీ త్రాగాడు.

తల్లి తన చెవినిపడ్డ సంబంధాల వివరాలు చెప్పింది. మౌనంగా విన్నాడు కృష్ణ. ఆనాడే సంబంధాలవేటలో పడ్డాడు.

ఒకరు తమ తాహతుకుమించి కట్నకానుకలు అడిగితే, మరొకరు యిప్పట్లో తమ కుమారుడికి పెళ్ళి చేసే ఉద్దేశ్యం లేదన్నారు. మరొకరు తమ కూతురు పెళ్ళయితేకాని కొడుకు పెళ్ళిచెయ్యం అన్నారు. ఇంకొకరు "మా అమ్మాయిని నువ్వు చేసుకుంటావా? అప్పుడు మీ చెల్లాయిని మావాడికి చేసుకుంటాం?" అన్నారు.

కృష్ణకు అలాటి కుండమార్పిడి పెళ్ళి యిష్టంలేక నీరసంగా ఇంటికి తిరిగివచ్చాడు. ఇక ఆ మరునాడు తాను బయలుదేరి వెళ్ళాలి.

అనుభవంలేని కృష్ణకు ఎదురైన సంఘటనలతో ఏం చెయ్యడానికీ తోచకుండాపోయింది.

మరునాడు తిరుగుప్రయాణం కట్టాడు.

"ఒరే కృష్ణా! బాధపడకు. అన్నీ మనం అనుకున్నట్టు జరుగుతాయా? అనుకున్నవి అనుకున్నట్టే జరిగితే మనిషికి యికపట్ట పగ్గాలుంటాయా? ఇంకేం బాధపడకు" అని, "ఇక వీరవరం వెంకట్రామయ్యగారి సంబంధం ఒకటే మిగిలిపోయిందిరా!" అంది రామలక్ష్మమ్మ.

"ఎలాగే అమ్మా! ఇవాళ బయలుదేరితేనేగాని నేను రేపటికి కాలేజీకి చేరుకోలేనుగదా?" అన్నాడు.

"పోనీ ఓ పని చెయ్యరాదూ?" అడిగింది రామలక్ష్మమ్మ.

"ఏమిటది?" అడిగాడు కృష్ణ.

"వీరవరం ఎలాగూ దారిలో ఊరే కదా?" అడిగింది రామలక్ష్మమ్మ.


"అయితే?" కృష్ణ జవాబు.

"వీరవరంలో ఓసారి దిగు. వెంకట్రామయ్యగారింటికి వెళ్లి సంబంధం మాట చెవినివెయ్యి. తరువాత రైల్లో నువ్వు వెళ్ళవచ్చు. మిగిలిన విషయాలు తరువాత చూచుకోవచ్చు" సందేహిస్తూనే చెప్పింది రామలక్ష్మమ్మ.

అది తల్లి చెప్పినంత సులువుకాదని కృష్ణకు తెలుసు. అయినా ఆమె చెప్పిన మాట కాదని మనసుకు కష్టం కలిగించడం యిష్టంలేక 'సరే' అన్నాడు.

దారిలో వీరవరంలో దిగాడు కృష్ణ. వెంకట్రామయ్యగారి యిల్లు సులువుగానే దొరికింది. వెంకట్రామయ్యగారికి వివరాలన్నీ చెప్పి వీలువెంబడి ఒకసారి పిల్లను చూచుకుందుకు రమ్మని చెప్పాడు.

"చూడబ్బాయీ! ప్రత్యేకంగా మేం బయలుదేరివచ్చి పిల్లను చూడనక్కరలేదు. ఫోటో చూపిస్తేచాలు. ఫోటో ఏమైనా



# అమ్మాయి పెళ్ళి

తెచ్చావా?" అని అడిగారు వెంకట్రామయ్యగారు.

కృష్ణ తేలేదని చెప్పాడు.

"ఫరవాలేదులే! మీ సాంప్రదాయం నాకు నచ్చింది. తిరిగి వెళ్ళాక మీ పిల్ల ఫోటో పంపించు. తరువాత ఏ సంగతీ మేం తెలియజేస్తాం" అన్నారు వెంకట్రామయ్యగారు.

కృష్ణ సరేనని చెప్పి తిరుగు రైల్లో విశాఖపట్నం చేరుకున్నాడు. కాలేజీలో లంచ్ అవర్లో కరామని వీరవరం సంబంధం వివరాలతో సహా అన్నగారికి ఉత్తరం రాశాడు. వీలైనంత త్వరలో వెంకట్రామయ్యగారికి ఫోటో అందజేయమని వ్రాశాడు.

పదిహేను రోజులు గడవకుండానే అన్నగారి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది కృష్ణకు.

వెంకట్రామయ్యగారి అబ్బాయికి స్టేట్స్‌లో ఫెలోషిప్పు వచ్చినకారణంగా వెంటనే పెళ్ళిచేసి కోడలితోసహా కొడుకును పంపించాలని తొందరచేశారనీ, అందుచేత వచ్చే శుద్ధ ఏకాదశినాడే పెళ్ళి ముహూర్తం నిశ్చయించవలసి వచ్చిందనీ రాస్తూ, వీలయినంత తొందరగా రమ్మని రాశాడు కృష్ణకు అన్నగారు. ముహూర్త సమయం వగైరా వివరాలు కూడా రాశాడు.

అన్నగారి ఉత్తరం చూచి కృష్ణ బ్రహ్మానందపడ్డాడు. ఉత్తరానికి నాలుగుమూలలా అంటించిన పసుపులో, పసుపు పారాణి కాళ్ళతో, ముఖాన కల్యాణ తిలకంతో, బుగ్గన చాదు చుక్కతో పెళ్ళికూతురు వేషంలోవున్న ముగ్ధమనోహరమయిన చెల్లి ముఖం కనిపించింది. మరికొద్దిసేపటిలో ఆ పారవశ్యంనుండి బయటపడి సెలవు దరఖాస్తుతోబాటు ప్రిన్స్‌పాల్‌గారి ముందు నుంచున్నాడు కృష్ణ.

సెలవు దరఖాస్తు ఆయనముందు పెట్టాడు కృష్ణ.


ఆయన ముక్కుద్దాలగుండా కృష్ణ అందించిన కాగితంవైపు తీక్షణంగా చూచి, ముఖభంగిమలో ఏ మార్పూలేకుండా తల పైకెత్తి, జారిపోతున్న అద్దాలను పైకెగదోసుకుంటూ కృష్ణవైపు చూచారు.

కృష్ణ మంచిబాలుడిలా వినయంగా నిలబడివున్నాడు.

"చూడండి మిష్టర్ కృష్ణా!" ప్రిన్స్‌పాల్‌గారే అందుకున్నారు "మీ కుర్ర లెక్చరర్స్‌తో వచ్చిన చిక్కే యిది. చీటికీమాటికీ సెలవులంటారు. కాదంటే కోపం! కాస్త సెన్స్ ఆఫ్ డ్యూటీ ఉండాలయ్యా!" అన్నారు.

కృష్ణ సవినయంగా విషయం అంతా వివరించాడు. మూలల పసుపు గుర్తులతో వున్న అన్నగారి ఉత్తరం కూడా చూపించాడు.

ఇన్నిచేసినా ఆయన "చూడండి మిష్టర్ కృష్ణా! మీ సబ్జక్టు తాలూకు కోర్సు యింకా పూర్తయినట్టులేదు. పరీక్షలలోగా కోర్సు పూర్తికాకపోతే స్టూడెంట్స్ నా కొంపమీకి పందిరివేస్తారు. అయాం సారీ!" అన్నారు.




కృష్ణ ప్రాధేయపడ్డాడు.

"మీ హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్‌చేత రికమెండు చేయించుకురండి. అప్పుడు మీ సెలవు శాంక్షన్‌చెయ్యడానికి నాకేం అభ్యంతరంలేదు." బట్టతల నిమురుకుంటూ అన్నారు ప్రిన్స్‌పాల్.

ఆ తంతులన్నీ ముగించుకుని సెలవు సంపాదించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది కృష్ణకు. ఆ మరునాటి రాత్రికే పెళ్ళి. తెల్లవారితే కాని రైళ్ళేమీ లేవు.

తెల్లవారుఝామున చచ్చిచెడి ఆటోవాలా అడిగినంతా ముట్టచెప్పి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు కృష్ణ. హడావిడిగా టిక్కట్టు కొనుక్కుని ప్లాట్‌ఫాం మీదకు చేరుకునేసరికి చావుకబురు చల్లగా తెలిసింది.

తనెక్కవలసిన రైలు మూడుగంటలు లేటు!

ఎలాగైతేనేం రైలుప్రయాణం పూర్తయ్యేసరికి చీకటిపడింది. వాచీ చూచుకున్నాడు. తమ ఊరికి చేర్చే ఆఖరుబస్సు టైము అవవస్తోంది. ఆఘమేఘాలమీద ప్రయాణించి బస్సుస్టేషన్‌కు చేరుకున్నాడు.

'ప్రజాసేవయే మా కర్తవ్యం' అన్న నినాదానికి సజీవ ఉదాహరణంలా ఉంది బస్సు. చీమ దూరడానికి కూడా సందులేనంతగా కిక్కిరిసి ఉన్నారు బస్సులో జనం. అభిమన్యుడు పద్మవ్యూహాన్ని ఛేదించుకుని ముందుకు పోయిన చందంగా జనం మధ్యగా దూసుకుంటూ పోయి తనూ బస్సెక్కాడు కృష్ణ.

ఒకటే ఉక్కపోత! నాసికాపుటాల్ని బద్దలుచేస్తూ కడుపులో ఉండేపేగులు బయటపడేంత ఘోరంగా చెమటకంపు. ఈలోగా ఆపద్బాంధవుడిలా చేతిలోని పంచర్‌తో బస్సు ఊచమీద కొడుతూ రైట్ రైట్! అన్నాడు కండక్టరు. అంతవరకూ ఎందరు ప్యాసింజర్లు బస్సు రేకులమీద దబదబా బాదినా ఖాతరుచేయని డ్రయివరు మహాశయుడు ఒక్క జర్క్‌తో బస్సును బయలుదేరదీశాడు.

బస్సు కదలికతో లోపలకు చొచ్చుకువచ్చిన గాలితో పోతున్న ప్రాణం లేచివచ్చినట్లయింది కృష్ణకు. 'టికెట్ టికెట్'

అంటూ దగ్గరకు వచ్చిన కండక్టరుకు సరియయిన చిల్లర యిచ్చి టికెట్ తీసుకున్నాడు కృష్ణ.

కండక్టరు ఖాళీచేసిన స్థలంలో ఊచను అనుకుని మరోచేత్తో పై ఊచను పట్టుకుని నిలబడి ఉన్నాడు కృష్ణ. బస్సులోవున్న జనం మధ్య రాజకీయాల చర్చ జరుగుతోంది. అదికూడా ఆంధ్రరాష్ట్రం మొదలుకొని అంతర్జాతీయ రాజకీయాలవరకూ సాగుతోంది. బస్సు మరోమూలనుండి కొందరు ఈమధ్యనే రాష్ట్ర హైకోర్టు తీర్పు ననుసరించి ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలా వద్దా అన్న విషయంమీద ఘాటుగా చర్చించుకుంటున్నారు.

ఆ సంభాషణ నుండి కృష్ణ తన మనస్సు యింటివైపు మరల్చాడు. జరగబోయే చెల్లెలిపెళ్లి ఘట్టాలు సినిమారీలులా కళ్ళముందు కదలాడసాగాయి.

అలా ఆనంద పారవశ్యంలో కలలుకంటున్న కృష్ణను ఓ కంఠం ఈలోకంలో పడేసింది. ఆ కంఠం తాలూకు శాల్తీ గురించి చూచాడుగాని జనంలో కనిపించలేదు. కాని ఆ స్వరం యిలా వినిపించింది.

"చూశావా సుబ్బారాయుడూ! కలికాలం ఎలా మండిపోతోందో?" అన్నాడు ఓ ఆసామీ.

"సర్వారాయుడు బావా! విషయం ఏమిటో చెప్పందే ఎలా తెలుస్తుందయ్యా?" అన్నాడు సుబ్బారాయుడు.

"అయితే ఈ విషయం సీదాకా రాలేదన్నమాట?" సర్వారాయుడు కంఠం.

"ఏ విషయం?" సుబ్బారాయుడు ప్రశ్న.

"అదేనయ్యా! మన ఆనందరావు ఈమధ్య వెలగపెట్టిన ఘనకార్యం."

"ఏం చేశాడేమిటి?"

"అదేనయ్యా! అమధ్య వాళ్లన్నయ్య అచ్యుతాపురంలో ఓ వరుడున్నాడనీ అతడి విషయం కాస్త వాకబుచెయ్యమనీ వ్రాశాడు మద్రాసు నుంచి." చెబుతున్నాడు సర్వారాయుడు.

"అయితే?" అడిగాడు సుబ్బారాయుడు.

"అయితే ఏమిటగియితే! ఆనందరావు చక్కగా ఆ వరుణ్ణి తన కుమార్తెకు కుదుర్చుకున్నాడు" చెప్పాడు సర్వారాయుడు.


ఆంధ్ర సచిత్ర వారపత్రిక

# హిట్ లిస్ట్

క్రైం, సస్పెన్స్‌లతో
మిమ్మల్ని
ఆనందింపచేసే
అద్భుత నవల

జి. వి. అమరేశ్వరరావు

త్వరలో ప్రారంభం!


సుబ్బారాయుడి కంఠం నుండి ఏ శబ్దమూ వినిపించలేదు. బహుశ ఆ వార్త నిని నిర్విణ్ణుడయివుంటాడు.

"ఇలాటివారు కూడా వుంటారా ప్రపంచంలో?" అనుకున్నాడు కృష్ణ.

ఈలోగా తమ ఊరు రావడంతో బస్సుదిగాడు కృష్ణ.

ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిది దాటింది. ఇంటి బయట పందిరి. పందిట్లో ఓ మూల సన్నాయిమేళం సుమధురంగా మ్రోగుతోంది. కొందరు పెద్దలు సన్నాయి స్వరాలకు అనుగుణంగా తల లూపుతున్నారు పారవశ్యంగా.

పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు.

పట్టుచీరలు గరగర శబ్దాలు చేస్తుండగా పువ్వులూ సుగంధ ద్రవ్యాలూ కలిసి వాతావరణంలో మత్తును రేకెత్తిస్తుండగా రతీదేవిలాగ లక్ష్మీదేవిలాగా సింగారించుకున్న అంగనలు హడావిడిపడిపోతున్నారు.

పందిట్లో ఓ వారగా జిల్సారాయుళ్ళు కొందరు చతుర్ముఖ పారాయణం సాగిస్తున్నారు. ఎలక్ట్రిక్ దీపాలు దేదీవ్యమానంగా వెలుగుతున్నా పక్కనే ఎత్తయిన పీటమీద ఓ పెట్రొమాక్స్‌లైట్ కూడా పెట్టుకున్నారు.

ఔనుమరి! వారిజాగ్రత్త వారిది! ప్రాణంపోకడయినా చెప్పవచ్చునేమోగాని దీపాల పోకడ ఎవరూ చెప్పలేనిది.

"ఏమయ్యా ఇప్పుడా రావడం?" అని వదిన పలకరించింది. తల్లి దూరంనుంచే తనని చూసి చూడనట్లు తప్పుకెళ్లింది.

"రావయ్యా పెళ్ళికూతురిని చూద్దువూ అది ప్రొద్దున నుంచి నిన్నే కలవరిస్తోంది" మరిదిని వెంటపెట్టుకు పెళ్ళికూతురు ఉన్న గదిలోకి తీసుకువెళ్లింది వదిన. పెళ్ళికూతురు స్థానంలో చెల్లెల్ని ఊహిస్తున్న కృష్ణ శ్రీదేవిని ఆ స్థానంలో చూసి స్థాణువే అయ్యాడు. కృష్ణ మెదడులో బస్సులోని సర్వారాయుడి కంఠం గింగురుమంటోంది.